క్లుప్తంగా

రేపు కానుకల లెక్కింపు

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీల కానుకలను రేపు(మంగళవారం) లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల లెక్కించనున్నట్లు తెలిపారు.

కమిటీ ఎన్నిక



గోవిందరావుపేట: మండలంలోని లక్నవరం సరస్సు వద్ద ఆదివారం పద్మశాలి ములుగు సహకార పరపతి సంఘం ఎన్నికలు మార్త రమేశ్ బాబు, ఎస్ చంద్రమౌళి, సబ్బాని రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా సామల మోహన్ రావు, కార్యదర్శిగా ఎస్ చంద్రమౌళి, కోశాధికారిగా ఆడెపు రాజు, ఉపాధ్యక్షులుగా పెండెం భిక్షపతి, కోడూరు రవి, సహాయ కార్యదర్శులుగా చుంచు రమేశ్, సబ్బాని రవీందర్ ఎన్నికయ్యారు. పరపతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన కర్ర రమేశ్, జంగాలపల్లి గ్రామానికి చెందిన మోట్లపల్లి కనకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, నల్లెల్ల భరత్‌కుమార్, అభినయ్, లక్కి, జగన్నాథం, రతన్, రాజేష్ తదితరులు ఉన్నారు.

యూత్ సభ్యుల శ్రమదానం



నల్లబెల్లి : మండలంలోని కన్నారావుపేట నుంచి శనిగరం జాతీయ రహదారి వరకు వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో కన్నారావుపేట ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఆదివారం శ్రమదానం చేసి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు పల్నాటి మూర్తి మాట్లాడుతూ ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు శ్రమదానం చేసి గుంతలను పూడ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కార్యదర్శి తండా సంపత్, సభ్యులు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, బండారి వర్ధన్, పులి అన్వేష్, సనుప బద్రి, తండా రాజు, చార్ల కర్ణాకర్, మణికుమార్ పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు ఆదర్శం

నల్లబెల్లి : మహ్మద్ ప్రవక్త బోధనలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సై గోవర్ధన్ సూచించారు. పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని ములుగు పట్టణానికి చెందిన మహ్మద్ చాంద్‌పాషా ఆదివారం నల్లబెల్లి మజీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేదవారికి సాయపడాలనే ప్రవక్త సూక్తులను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రంజాన్ మాసంలో శాంతి, సామరస్యానికి నిదర్శనంగా ముస్లింలు ఉపవాస దీక్ష చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు మత గురువు మహ్మద్ రషీద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అధ్వానంగా పల్లె ప్రకృతి వనాలు



తిప్పాపురంలో పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలు



బీసీ మల్లిగూడెం పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

- ఎండిపోతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించాలని గత ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కాగా ఈ పల్లె ప్రకృతి వనాల నిర్వహణ సర్పంచ్‌ల పదవీ కాలం ఉన్నంత వరకు బాగానే సాగింది. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలను రక్షించేందుకు చర్యలు చేపట్టారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన తర్వాత వాటి నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. కాగా వారికి పని భారం పెరగటంతో పాటు ఇతర పనులు కూడా వారే చూడాల్సి రావటంతో పల్లె ప్రకృతి వనాలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. దీంతో ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పంచాయతీల్లో ప్రకృతి వనాల నిర్వహణకు బోర్లను ఏర్పాటు చేసిన మొక్కలకు నీరు పట్టే వారే లేకుండా పోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మొక్కలకు నీరు పట్టాలి..



మండలంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రకృతి వనాల్లో మొక్కలు నీరు లేక ఎండుతున్నాయి. మొక్కలను రక్షించేలా చర్యలు తీసుకోవాలి. ఎండి పోకుండా నీరు పట్టించాలి.

- యూనిస్, బీసీ మల్లిగూడెం

దొంగతనం కేసులో నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ మల్లేశ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ మల్లేశ్

టేకుమట్ల: మండలంలోని బోర్నపల్లి గ్రామంలో ఇంట్లో దోపిడి చేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసి, సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు చిట్యాల సీఐ మల్లేశ్ ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బోర్నపల్లికి చెందిన కొండ మొగిళి ఇంట్లో గత నెల 13న ఎవరు లేని సమయంలో తాళం పగలగొట్టి రూ.3.50 లక్షలు, ఏడు తులాల బంగారం గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లగా కేసు నమోదు అయిందన్నారు. ఈ మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలించినట్లు తెలిపారు. టేకుమట్ల ఎస్సై దాసరి సుధాకర్ శనివారం సాయంత్రం ఆశిరెడ్డిపల్లి శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో పలువురిని పట్టుకుని విచారించగా గత నెల బోర్నపల్లిలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని అన్నారు. నేరస్థులు పవన్, అరవింద్, లోకేష్, గోవర్ధన్ జల్సాలకు అలవాటు పడి, డబ్బులు సులభంగా సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగతనాలకు పాల్పడ్డారని దొంగిలించిన సొత్తులో కొంత అమ్మడానికి పరకాల వెళ్తున్న క్రమంలో పట్టుబడినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.90 వేలు, ఐదు తులాల బంగారం, రెండు తులాల బంగారానికి సంబంధించిన తాకట్టు రసీదు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన సీఐ మల్లేశ్, ఎస్సై దాసరి సుధాకర్, అమరేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రంజిత్, ప్రశాంత్, వెంకటేష్, మహేందర్, రామకృష్ణలను భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అభినందించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



రేగొండ: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లె, బుర్రకాయల గూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి మహిళ సంఘాలకు చెక్కును అందజేశారు. అలాగే పలు గ్రామాల్లో రూ.13.35 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు.

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రూ.2 కోట్ల నిధులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఆలయ కమిటీ, పూజారులు మేళతాళాలు, పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధిలో మరో యాదాద్రిగా తీర్చిదిద్దుతనన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఈఓ మహేష్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు నాయినేని సంపత్‌రావు, పున్నం రవి, సూదనబోయిన ఓంప్రకాష్, పబ్బ శ్రీనివాస్, వీరబ్రహ్మం, గండి తిరుపతి, ముద్దమల్ల రవి, శ్రీరాముల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేతకాని కులస్తులకు అన్యాయం

- నేతకాని సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఈశ్వర్

వెంకటాపురం(కె): ఎస్సీ వర్గీకరణతో నేతకాని కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జాడి ఈశ్వర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వాడగూడెం గ్రామంలో నేతకాని సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరంలో కులగణన చేపట్టి కులాల వారిగా జనాభాను ప్రకటించకుండా, 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయటం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కొన్ని ఎస్సీ కులాలు ప్రస్తుతం తెలంగాణలో లేవని ఆయన అన్నారు. ఏజెన్సీలో నేతకాని కులస్తులను ఎస్సీ జాబితా నుంచి తొలగించి ఏజెన్సీ నేతకాని పేరుతో ఎస్టీలో చేర్చాలని కోరారు.

పోరాటయోధుడు భగత్‌సింగ్



శాయంపేట : భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



పరకాల : భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పరకాల : భారత దేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అతిచిన్న వయస్సులో వణికించిన పోరాటయోధుడు భగత్‌సింగ్ బాటలో నేటి యువత ప్రయాణించాలని ప్రజాసంక్షేమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మడికొండ రఘుపతి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ నక్క చిరంజీవి పిలుపునిచ్చారు. పట్టణంలోని అమరధామంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

శాయంపేట : యువత లక్ష్యాన్ని పాలకులు నీరుగారుస్తున్నారని ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి అన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజగురు సుఖ్‌దేవు 94వ వర్ధంతిని హనుమకొండ జిల్లా డివిజనల్ కార్యదర్శి నీల రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హంసారెడ్డి హాజరై భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రి, నాగార్జున, మహ్మద్ ఉస్మాన్, ఎంఎస్ రావు, భద్రయ్య, రవీందర్, సతీశ్ ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ఏటూరునాగారం: చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గోవిందరావుపేటలో..

ఏటూరునాగారం: పలు కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన బాధితులు సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా చెక్కులు మంజూరయ్యాయి. దీంతో బాధితులకు మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు చెక్కులు అందజేసి మాట్లాడారు. మంత్రి సీతక్క చొరవతో సీఎం సహాయ నిధి నుంచి మండలంలోని తొమ్మిది మంది లబ్ధిదారులకు రూ.మూడు లక్షల 17 వేల విలువ గల చెక్కులు రాగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, వావిలాల నర్సింగరావు, వంగపండ్ల రవి, చేల వినయ్, మడుగూరి ప్రసాద్, లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆదివారం అందజేశారు. మండల పరిధిలోని గోవిందరావుపేట, దుంపెల్లిగూడెం, పస్రా, బుస్సాపూర్, లక్నవరం, చల్వాయి గ్రామాలకు చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులకు రూ.3 లక్షల 69 వేల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రసుపుత్ సీతారాం నాయక్, జెట్టి సోమయ్య, నాగేందర్ రావు, ప్రభాకర్, శ్రీకాంత్, చంద్రశేఖర్, నాగమణి, జయమ్మ, రాజు, వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా జయంతి వేడుకలు



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

రేగొండ: సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో 93వ ఏకాదశ రుద్రాభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి స్ఫూర్తితో సమాజసేవకు అంకితమవ్వాలని సేవా సమితి సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, సేవా సమితి సభ్యులు ఓదెల మల్లయ్య, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

చదువుతోనే బాలికల అభివృద్ధి



పుస్తకాలు అందుకున్న విద్యార్థినులతో రాజ్‌కుమార్

నర్సంపేట : బాలికల అభివృద్ధి చదువుతోనే సాధ్యమవుతుందని, మహాత్మ జ్యోతిబాపులే, సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడుస్తూ చక్కటి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని నర్సంపేట రీజనల్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ప్రిన్సిపాల్ మంగ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తన పూర్వ విద్యార్థులను సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా భాగస్వాములను చేస్తూ ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కవి, వక్త కాసుల రవికుమార్‌ను అభినందించారు. రవికుమార్, జాయిన్ హ్యాండ్స్ ఫౌండేషన్ బాధ్యులు మాట్లాడుతూ విద్య ద్వారానే వికాసం అన్నారు. చదువు, ఆటపాటల్లో చక్కటి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాయిన్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు ఆంగ్ల వ్యాకరణ పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో నల్లబెల్లి, నెక్కొండ గురుకులాల ప్రిన్సిపాళ్లు మల్లయ్య, జయ శ్రీ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



మంగపేట: ఆర్థికం సాయం అందజేస్తున్న నాయకులు

మంగపేట: మండలంలోని బాలన్నగూడెం గ్రామానికి చెందిన దన్నూరి సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు జిల్లా సీనియర్ నాయకుడు తాటికృష్ణ ఆదివారం పరామర్శించి రూ.12,500ల ఆర్థిక సాయం అందజేశారు. మంగపేట పీఏసీఎస్ చైర్మన్ తోట రమేష్, నాయకులు బాడిష నాగరమేష్, రాంబాబు, సాంబయ్య, యాలం లక్ష్మీనారాయణ, కల్తి శ్రీను, మోడెం ఈశ్వర్, యాలం లక్ష్మీపతి, జనగం చుక్కయ్య, దంతనపల్లి నరేందర్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని కొత్తగుడిసెలా ప్రాంతానికి చెందిన తుమ్మ గంగయ్య విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు పార్టీ నాయకుల ద్వారా రూ.5వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో తాడూరి రఘు, రాంనర్సయ్య, మల్లారెడ్డి, బోజారావు, ఖాజాపాషా, నర్సయ్య, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: మండలంలోని కొడవటంచ గ్రామానికి చెందిన పంచాయతీ సిబ్బంది పోగు సుమన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను విద్యుత్ ఉద్యోగులు పరామర్శించి, రూ.27 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కట్ల సదయ్య, మట్టేల వేణు, నిమ్మల మల్లేశం, జక్కు రాజేందర్, తీగల రవిందర్, కోరపల్లి విష్ణు, పల్నాటి శ్రీనివాస్, ఆకుల నవీన్, నిమ్మల విజయ్, సిరంగి మల్లికార్జున్, వెంకటేశ్ పాల్గొన్నారు.

స్నేహితుడికి కుటుంబానికి..

మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన అయిలి వేణు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను వేణుతో కలిసి 1994–95 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న మిత్రులు పరామర్శించి, రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వేబ్రిడ్జి తూకంలో తేడా..

- ధర్నాకు దిగిన రైతులు
- సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే రేవూరి, బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

దామెర : వేబ్రిడ్జి తూకంలో మోసం చేస్తున్నారని రైతులు ఆగ్రహిస్తూ జాతీయ రహదారిపై ఆదివారం ధర్నాకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దుర్గంపేట్ గ్రామంలో గల జైహనుమాన్ వేబ్రిడ్జిలో ఓ రైతు మొక్కజొన్న సీడ్‌ను తూకం చేయగా 6,330గా వచ్చింది. అయితే అంతకు ముందు అదే గ్రామంలోని మరో వేబ్రిడ్జిలో మొక్కజొన్న సీడ్‌ను రైతు తూకం వేయగా 6,495 వచ్చింది. దీంతో క్వింటాల్ 65 కిలోల తేడా వచ్చిందని, ఇంత తేడా ఎలా వస్తుందని రైతు ప్రశ్నించగా వేబ్రిడ్జి యజమాని దరుసుగా సమాధానం చెప్పాడని రైతులు ఆగ్రహించారు. దీంతో ట్రాక్టర్లను హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారిపై అడ్డుగా పెట్టి ధర్నాకు దిగారు. రైతులు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే తూకంలో మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా రైతులను మోసం చేస్తున్న వేబ్రిడ్జి యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా కారణంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అటుగా వెళ్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి వేర్వేరుగా రైతులతో మాట్లాడారు. కాగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరకాల ఆర్డీఓ నారాయణ, జిల్లా తూనికలు, కొలతల అధికారి శ్రీలతను సంఘటన స్థలానికి చేరుకోవాలని సూచించారు. దీంతో వారు వేబ్రిడ్జిను పరిశీలించి తూకంలో తేడా ఉందని గుర్తించి జైహనుమాన్ వేబ్రిడ్జిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ధర్నాలో ఆత్మకూరు, దామెర, ఆత్మకూరు మండలాల రైతులు పాల్గొన్నారు.

కూలీలకు పెరిగిన డిమాండ్

- కోత దశలో మిర్చి పంట
- ఇబ్బందులు పడుతున్న రైతులు

మొగుళ్లపల్లి: మండలంలో దాదాపు 3200 ఎకరాల్లో ఈ సంవత్సరం మిర్చి పంటను సాగు చేశారు. ఆరుగాలం కష్టపడి రైతులు పడించిన మిర్చి పంట కోత దశకు చేరుకుంది. కొన్ని గ్రామాల్లో మొదటి సారి మిర్చి ఏరుతుండగా మరికొన్ని గ్రామాల్లో కూలీలు అందుబాటులో లేక ఏరలేని పరిస్థితి.

ఆందోళనలో రైతులు

వాతావరణ మార్పుతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం పడితే మిర్చి పంట నష్టపోయే ప్రమాదం ఉంది. దీంతో రైతులు మిర్చిని ఏరేందుకు అందరూ ఒకే సారి ఆసక్తి చూపడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఒక కూలీకి రోజుకు రూ.300 ఇస్తున్నప్పటికీ దొరకని పరిస్థితి. చేసేది ఏమి లేక మండలంలోని పలు గ్రామాల నుంచి, పక్క మండలాలైనా చిట్యాల, టేకుమట్ల, జమ్మికుంట మండలాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. దీంతో రవాణా భారం కూడా రైతులపై పడుతుంది. వర్షకాలంలో కురిసిన వర్షాల వల్ల పంటలు దెబ్బతినడం, చీడ పీడలు రావడంతో రైతులకు ఈ సంవత్సరం పెట్టుబడి కూడా పెరిగింది. వాటితో పాటు చేతికి వచ్చిన పంటను ఏరేందుకు కూడా కూలీలకు అదనంగా చెల్లించాల్సి రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ మార్పుల వల్ల వానలు కురిస్తే తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు.



కోతకు సిద్ధంగా ఉన్న మిర్చి


ఖర్చులు పెరిగాయి



కూలీలు దొరకపోవడంతో పక్క గ్రామాల నుంచి తీసుకోని రావాల్సి వస్తుంది. కూలీలకు రోజుకూ 300లకు పైగా చెల్లించిస్తున్నాం. ఎకరానికి రూ.2లక్షల పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఈ సారి పెట్టుబడి ఖర్చుతో పాటు కూలీల ఖర్చులు కూడా పెరిగాయి.

- అంబీర బాపురావు గణేష్‌పల్లి

బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



గోవిందరావుపేట: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై యాప్స్‌ల ద్వారా ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. పస్రా పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో బెట్టింగ్ యాప్స్‌తో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెట్టి రూ.లక్షల్లో డబ్బులు పోగొట్టుకొని అప్పుల పాలైన యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చూస్తునే ఉన్నామని అన్నారు. అలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. సరదాగా మొదలైన బెట్టింగ్ వ్యసనంగా మారుతుందని అన్నారు. మండలంలో ఎక్కడైనా ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే 100కు డయల్ చేయాలని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారాన్ని ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు పారితోషికం అందిస్తామని తెలిపారు.